ప్రియమైన సోదరీసోదరులారా,

సెప్టెంబరులో జరుగబోయే భండారాకు తయారవడంలో భాగంగా మాస్టరుగారు ఆగస్టు 25, 2015 న వ్రాసిన ఈమెయిల్లో చాలా స్పష్టంగా ఈ క్రింది విధంగా ఆదేశించడం జరిగింది:

> "అభ్యాసులందరూ, ప్రిసెప్టర్లతో సహా, **సత్యోదయం** పుస్తకాన్ని క్షుణ్ణంగా మరల మరల చదువవలసి ఉంది, వాళ్ళు ఇంతకు ముందు చాలా సార్లు చదివి ఉన్నప్పటికీ కూడా. ముఖ్యంగా, 'సాక్షాత్కారము', 'సాధనోపాయములు' అనే రెండు అధ్యాయాలపై ప్రత్యేక దృష్టిని సారించమని వాళ్ళకి చెప్పండి."

సత్యోదయం పుస్తకాన్ని లోతుగా అర్థం చేసుకొనేందుకు సహకరించే ఆక్టివిటీ (కార్యక్రమం) ఈ దిగువన ఇవ్వబడింది:

రానున్న 3 వారాలూ మీ అందరూ **సత్యోదయం** పుస్తకాన్ని చదవడమూ, దానిని మననం చేయడమూ చేయబోతున్నారు. అదే పుస్తకం ఈ విధంగా మళ్ళీ క్రొత్తగా చదవడం వల్ల ఎంత ఆవిష్కరించగలుగుతారో చూస్తే మీరే ఆశ్చర్యపోతారు. ఇక్కడ పతిపాదిస్తున్న పద్ధతి ద్వారా, మీరు నిజంగా ఎంతగానో నిమగ్నులైపోవడం ద్వారా మన మాస్టరుగారి సాహిత్యంలో నిక్షిప్తమై ఉన్నదంతా బాగా జీర్ణం చేసుకోగలుగుతారు.

ఈ కార్యక్రమాన్ని పలురకాలుగా మీరు వినియోగించుకోవచ్చు:

- ఈ క్రింద తెలిపిన పద్ధతిని మీరు స్వంతంగా అనుసరించి పుస్తకాన్ని మరింత లోతుగా అర్థం చేసుకోవడానికి వినియోగించుకోండి.
- అభ్యాసులను కొంతమందిని మీ ఇంటికి ఆహ్వానించి, అందరూ కలిసి ఈ పుస్తకాన్ని చదవండి.
- ఆదివారం సత్సంగం తరువాత మీ సెంటరులో, మీ సెంటరు-ఇన్చార్, వారి స్థానిక బృందం సహకారంతో దీనిని ఒక కార్యక్రమంగా నిర్వహించండి. మీమీ సెంటర్లలో ఈ కార్యక్రమాన్ని చేయాలని ముందుగానే తేదీలను నిర్ణయించుకున్నారేమో తెలుసుకోండి.

ఈ కార్యక్రమంలో పాల్గొనే అభ్యాసులందరూ ఈ క్రింద పొందుపరచిన మార్గదర్శకాలను అనుసరించాలి:

## చదివే విధానం

మొదటి వారంలో: **సత్యోదయం** పుస్తకంలోని మొదటి మూడు అధ్యాయాలను తీసుకోండి. రోజుకొక అధ్యాయం చదవండి. ఈ క్రింది పద్ధతిని అనుసరించండి:

- చదువుతూండగా, ఒక పెన్సిలు చేతిలో పెట్టుకోండి. మీకు ఫలానా పదం చాలా **<u>ముఖ్యం</u>** అని అనిపించినప్పుడు దాన్ని అండర్లైన్ చెయ్యండి. దీన్ని మనం **<u>కీలకమైన పదం</u>** అంటాం.

- మీరు అండర్లైన్ చేసే పదాలు కేవలం కీలకమైన పదాలే అయి ఉండేలా చూసుకోండి. ఫలానా పదం మీకు ముఖ్యం, అని అపించినంతవరకూ, ఈ కీలకమైన పదాలను ఎన్ని గుర్తిస్తాం అన్నదానికి పరిమితి ఏమీ లేదు, ఎన్నైనా ఉండవచ్చు. కీలకమైన పదాలు అంటే సాధారణంగా కేవలం ఒక్క పదమే అవ్వాలి, ఒక వాక్యం కాకూడదు. కొన్ని అసాధారణంగా రెండేసి పదాలుగా అండర్లైన్ చేసి ఉండవచ్చని గమనించండి: ఉదాహరణకు – 'డబ్బైరెండు తరాలు' అనే పదం.

- ఒక్కొక్క అధ్యాయం చదవడం పూర్తయిన తరువాత, మీరెంచుకున్న కీలక పదాలన్నిటినీ మీ డైరీలో ఒకే పేజీలో పెద్ద అక్షరాల్లో స్పష్టంగా కనిపించేలా వ్రాసుకోండి. వ్రాసేప్పుడు, పదానికి, పదానికీ మధ్య ఖాళీ ఉంచండి.

- మీకు ఇంకా సమయం గనుక ఉంటే, పెన్సిల్ అక్కర్లేకుండా, ఒక్కొక్క అధ్యాయాన్ని రెండు-మూడు సార్లు చదవండి.

- మరునాడు ఆ కీలకపదాలు వ్రాసుకున్న డైరీని తెరచి, వాటిని దృష్టిలో పెట్టుకొని, (ఒక పేజీకి మించకుండా) ఆ అధ్యాయాన్ని గురించి మీరు ఏ విధమైన అనుభూతిని చెందారో క్లుప్తంగా వ్రాయండి. వ్రాసే సమయంలో ఈ క్రింది అంశాలను దృష్టిలో ఉంచుకోండి:
  ఈ అధ్యాయాన్ని చదువుతున్నప్పుడు ఎటువంటి అవగాహన కలిగింది?
  నా హృదయంలో ఏమనిపించింది?
  ఈ అధ్యాయం చదివిన తరువాత నా స్థితి ఏ విధంగా ఉంది?

  మనసులో ఉంచుకోవలసిన మరికొన్ని విషయాలు:
  పొడుగాటి వివరణలు ఇవ్వకండి.

వ్రాసేటప్పుడు మళ్ళీ మళ్ళీ పుస్తకం తిరగేయకండి.
కేవలం మీ డైరీలో మీరు వ్రాసుకున్న కీలకపదాలను మాత్రమే చూసి, ఆ అధ్యాయం మీలో కలిగించిన ప్రేరణను వ్రాయండి.

ఇదే పద్ధతిని ప్రతీ అధ్యాయానికీ అన్వయించండి.
వారం పూర్తయ్యేసరికి, మొదటి 3 అధ్యాయాలూ చాలా సార్లు చదివేసి ఉంటారు.

ప్రశ్నలొస్తే ఏంచేయాలి?
పుస్తకం చదువుతున్నప్పుడు మీకేదైన ప్రశ్న ఉదయిస్తే మీ డైరీలో వ్రాసుకోండి. క్రింద ఇచ్చిన సామూహిక ప్రక్రియలో ఈ ప్రశ్నలను అడగకండి; మీరు ఏమి అర్థం చేసుకున్నారో పంచుకోవడానికి నిర్దేశించినది ఈ ప్రక్రియ. అంతేగాక నిజమైన అవగాహన అనేది వ్యక్తిగతమైనది; అది లోపలి నుండి కలిగేలా చూడండి. ఈ ప్రశ్నలు వచ్చినప్పుడు కొంచెం సేపు ధ్యానించడానికి ప్రయత్నించండి. ఈ విధంగా చేయడానికి ప్రయత్నించండి: ధ్యానం చేసే ముందు, నిద్రపోయే ముందు, ఈ ప్రశ్నను ముందుంచుకోండి; సమాధానం మీలోపలి నుండే రానీయండి. ఒక్కోసారి సమాధానం పుస్తకంలోని మరో భాగం నుండి కూడా రావచ్చు, లేక మరో పుస్తకం నుండి రావచ్చు. ఒక్కోసారి మరెప్పుడో తరువాత రావచ్చు. సహజంగా ఎప్పుడొస్తే అప్పుడు రానీయండి.

## ప్రక్రియ

మీ సమూహంలో (గ్రూపులో) ఉన్న అభ్యాసులతో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేయండి లేదా మీ సెంటరులో జరిగే కార్యక్రమంలో పాల్గొనండి.

ఒక సమూహంలో (గ్రూపులో) 5 లేక 10 అభ్యాసులు కంటె ఎక్కువ ఉండకుండా చూసుకొని, సత్సంగం తరువాత కలిసి కూర్చొని ఈ చదివినప్పుడు కలిగిన అనుభవాలను, కనుగొన్నవాటిని పంచుకొనే ప్రయత్నం చేయండి.

ఈ క్రింద ఇచ్చిన ప్రశ్నలను ఒక్కొక్కటిగా అందరూ కలిసి పరిశీలించండి. అందరూ వ్యక్తం చేసుకోగలిగేలా, ఒకర్నొకరు వినిపించుకొనే విధంగా భావాలను పంచుకొనే ప్రక్రియ ఇది అని గుర్తుంచుకోండి. వివరణల్లోకి, వాదనల్లోకి వెళ్ళకుండా చూసుకోండి. కేవలం మీ భావాలను, మీరు కనుగొన్నవాటిని మాత్రమే పంచుకోండి.

ఈ 3 అధ్యాయాలూ చదివిన తరువాత ఈ పుస్తకంపై మీకు ఎటువంటి భావన కలిగింది?

ఈ విధంగా చదువుతున్నప్పుడు మీరు కనుగొన్న అత్యధిక అంతర్దృష్టితో కూడుకున్న అంశం ఏది?

ఇలా చదవడం వల్ల, మీ జీవితంలో గాని, ప్రవర్తనలో గాని, సాధనలో గాని ఏమైనా మార్పు చోటుచేసుకోవడం మేరేమైనా గమనించారా?

**సత్యోదయంలోని** మిగిలిన 7 అధ్యాయాలు చదవడానికి కూడా ఇదే పద్ధతిని అనుసరించండి. ఈ క్రింది క్రమాన్ని అనుసరించి భండారాలోపల ఈ పుస్తక అధ్యయనం పూర్తయ్యేలా చూడండి: రెండవ వారం – 4 నుండి 6 అధ్యాయాలు; మూడవ వారం – 7 నుండి 10 అధ్యాయాలు.